క్లుప్తంగా

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా దుర్గాప్రసాద్



నందిగామ టౌన్‌: నందిగామపురపాలక సంఘం శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా దుర్గాప్రసాద్‌ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆత్మకూరు మున్సిపాలిటీలో పనిచేస్తూ బదిలీపై ఆయన ఇక్కడికి వచ్చారు. కమిషనర్‌ లోవరాజును కలిసి తన జాయినింగ్‌ రిపోర్టు ఇచ్చారు. ఈసందర్భంగా కమిషనర్‌ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్‌ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలని సూచించారు.

డాక్టర్లకు ఘనసత్కారం



జగ్గయ్యపేటఅర్బన్‌: స్థానిక లయన్స్‌ క్లబ్‌ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం డాక్టర్స్‌ డే ఉత్సవాలను నిర్వహించారు. క్లబ్‌సభ్యులంతా కలిసి డాక్టర్‌ షైలా, డాక్టర్‌ లక్ష్మీ ప్రసన్న, డాక్టర్‌ శ్రీకాంత్‌, డాక్టర్‌ రాజా కేశవప్రసాద్‌లను ఘనంగా సత్కరించారు. వైద్యుల సేవలను కొనియాడారు. లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ జగ్గయ్యపేట అధ్యక్షుడు శ్రీరామ్‌ బదరీనారాయణ, కార్యదర్శి షేక్‌ ఖాసింసైదా, క్లబ్‌ ప్రతినిధులు మోహన్‌ బాబు, ఎస్‌వీవీ సత్యనారాయణ, కరుణాకర్‌, రవికుమార్‌, అమరనాథ్‌, శ్రీనివాసరావు, పుల్లారెడ్డి, నాయుడు, యోగా గురువు లీలావతి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఏకత్వ విద్యార్థులు



వీరులపాడు: జాతీయస్థాయి ఫెన్సింగ్‌ పోటీలకు ఏకత్వ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ఉప ప్రధానోపాధ్యాయులు ఐశ్వర్య, సాంబశివన్‌ తెలిపారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను స్థానిక పాఠశాల ఆవరణలో బుధవారం అభినందించారు. ఇటీవల విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్‌ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో విజేతలుగా నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. మహారాష్ట్రలోని నాసిక్‌ పట్టణంలో జరగనున్న తొమ్మిదవ జాతీయ ఫెన్సింగ్‌ పోటీలకు రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు చెప్పారు. జాతీయస్థాయి పోటీలలో సైతం ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అమరనేని మనోజ్‌, వ్యాయామ విభాగాధిపతి విజయ్‌ కుమార్‌ ల్గొన్నారు.

టీడీపీ నాయకుల నిలదీత



జగ్గయ్యపేటఅర్బన్‌: పట్టణంలోని మూడో వార్డు పుట్టబజారులో బుధవారం నిర్వహించిన 'సుపరిపాలన–తొలిఅడుగు' కార్యక్రమంలో ఆయా సమస్యలపై ప్రజలు, టీడీపీ నాయకులను ప్రశ్నించారు. 'సుపరిపాలన–తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు ఇంటింటికీ తిరిగి ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించగా, తమకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని అప్రాంతవాసులు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్‌ను కోరారు. లోఓల్టేజీ సమస్య, నూతన విద్యుత్‌ స్తంభాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే స్పందిస్తూ ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కట్టా నరసింహారావు, ఆపార్టీ మండల, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

మహామండపంలో ఈవో తనిఖీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై ప్రతి అడుగు అమ్మవారి భక్తులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని ఈవో శీనానాయక్‌ ఇంజినీరింగ్‌ అధికారులను ఆదేశించారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన ఆవరణలోని మహామండపం ఆరు అంతస్తులను ఈవో శీనానాయక్‌ బుధవారం పరిశీలించారు. తొలుత మహా మండపం 5వ అంతస్తులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న దుకాణ సముదాయాన్ని పరిశీలించారు. దేవస్థానం నిర్దేశించిన కొలతల మేరకే షాపులు ఏర్పాటు చేసుకునేలా చూడాలని ఈఈ రాంబాబును ఆదేశించారు. ఇటీవల నిర్వహించిన బహిరంగ వేలంలో షాపులు దక్కించుకున్న వారికి వెంటనే షాపులు కేటాయింపు చేయాలని సూచించారు.

• తిరుపతమ్మకు సారె సమర్పణ



సారె తెచ్చిన మహిళలకు స్వాగతం పలుకుతున్న ఆలయ ఈజీ కిషోర్‌కుమార్‌, ఈఈ రమ



ఊరేగింపుగా సారె తెస్తున్న మహిళలు

పెనుగంచిప్రోలు: ఆషాఢమాసం సందర్భంగా పెనుగంచిప్రోలులో వేంచేసి ఉన్న తిరుపతమ్మ వారికి బుధవారం గ్రామంలోని భక్త సేవా సేవాసంఘం ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో మహిళలు సారె సమర్పించి బోనాలు చెల్లించారు. అమ్మవారి రంగుల మండపం వద్ద నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకోగా వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారికి సారె సమర్పించారు. సేవాసంఘం వారు ఆలయ అధికారులతోపాటు పాలకవర్గం, ప్రజాప్రతినిధులు, పెద్దలను సత్కరించారు. అనంతరం పెద్దసంఖ్యలో పాల్గొన్న మహిళలకు ఆలయం వారు భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ వేల్పుల పద్మకుమారి, ఆలయ ఈవో బీహెచ్‌వీఎస్‌ఎన్‌ కిషోర్‌కుమార్‌, ఈఈ ఎల్‌.రమ, ఏఈఓ జంగాల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు కాకాని స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి సారె సమర్పిస్తున్న మహిళలు



అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్న మహిళలు



సారె తెచ్చిన మహిళలతో ఈవో కిషోర్‌కుమార్‌, ఆలయ ఉద్యోగులు

కార్మిక చట్టాల రద్దు తగదు : సీఐటీయూ



సమ్మె నోటీస్‌ అందజేస్తున్న సిఐటియు, వర్కర్స్‌ యూనియన్‌ నాయకులు

నందిగామ రూరల్‌:కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేస్తూ కేంద్రప్రభుత్వం కార్మికులకు తీరని అన్యాయం చేసిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్‌ పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వ తీరుకు నిరసనగా ఈనెల 9వతేదీన చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నట్లు పేర్కొంటూ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్‌ యూనియన్‌ నాయకులు బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నందిగామ ఎంఈవో పద్మను కలిసి సమ్మె నోటీస్‌ అందజేశారు. ఈ సందర్భంగా గోపాల్‌ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన లేబర్‌ కోడ్‌లను రద్దు చేయడంతోపాటు కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్‌ యూనియన్‌ నాయకులు అందూరి సుశీల, తాటి తులశమ్మ, దుర్గా, పద్మ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల బకాయిలు చెల్లించాలని డిమాండ్‌



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఉపాధ్యాయులు

నందిగామరూరల్‌: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంతోపాటు పెండింగ్‌ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్‌ మీసం శ్రీధర్‌ రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఎస్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని రాఘవాపురం, కమ్మవారిపాలెం, పల్లగిరి, రుద్రవరం, సోమవరం, దాములూరు, కొణతమాత్మకూరు, జొన్నలగడ్డ, రామిరెడ్డిపల్లి, కొండూరు, మాగల్లు గ్రామాల్లో బుధవారం ఆసంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరెండర్‌ లీవ్‌, పీఎఫ్‌, సిపిఎస్‌ బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరారు. చిన్న చిన్న కారణాలతో ఉపాధ్యాయులకు షోకాజ్‌ నోటీసులిచ్చి ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కట్టా వంశీ, మేకపోతుల రామకృష్ణ, జిలాని, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోడ్డును అభివృద్ధి చేయాలంటూ విద్యార్థుల ఆందోళన



బురదమయమైన రోడ్డులో ఇబ్బందులు పడుతూ కళాశాలకు వెళ్తున్న విద్యార్థులు



రోడ్డును అభివృద్ధి చేయాలంటూ ఆందోళన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

కంచికచర్ల: చిన్నపాటి వర్షానికే కంచికచర్లలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాల రోడ్డు చిత్తడిగా మారుతుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డంతా బురదమయం కావడంతో నడిచేందుకు అవస్థలు పడుతున్నారు. ఈక్రమంలో ఈ రోడ్డును అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేస్తూ విద్యార్థులు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కలిసి బుధవారం ఆందోళన చేశారు. ఈసందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు గోపీనాయక్‌ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలకు వెళ్లే గ్రావెల్‌ రోడ్డు అధ్వాన్నంగా మారిందన్నారు. ప్రభుత్వం స్పందించి నేషనల్‌ హైవే నుంచి జూనియర్‌ కళాశాల వరకు సీసీ రోడ్డు వేయాలని డిమాండ్‌ చేశారు. కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు జాహిదా, దీపికా, తులసి, వరలక్ష్మి, అంకిత, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో అలా...వదిలేశారు



కన్నెవీడులో అసంపూర్తిగా మిగిలిన సచివాలయ, హెల్త్‌సెంటర్‌ భవనాలు



పెద్దమోదుగపల్లిలోని ఆర్‌బీకే భవనం



పనులు పూర్తికాని పెద్దమోదుగపల్లిలో సచివాలయ భవనం

వత్సవాయి: గత వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వహయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామస్వరాజ్యం దిశగా సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టి కోట్లాది రూపాయలు వెచ్చించి నియోజకవర్గ వ్యాప్తంగా సచివాలయ భవనాలు, రైతుభరోసా కేంద్రాలు, విలేజ్‌ హెల్త్‌ క్లీనిక్‌ల నిర్మాణం చేపట్టారు.అయితే ఆయా భవనాల పనులను పూర్తిచేయడంలో కూటమి ప్రభుత్వం ఏడాదిగా మీనమేషాలు లెక్కిస్తోంది. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయం నాటికి మండలంలోని మొత్తం 19 సచివాలయ భవనాల పనుల్లో నాలుగు పూర్తికాగా, మిగిలిన 15 భవనాల పనులు 90శాతం పూర్తయ్యాయి. ఎన్నికల తర్వాత అధికారం చేపట్టిన సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న ఆయా భవనాల పనులను పూర్తిచేయడంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. దీంతో ఆయా భవనాల పనులు ఏడాదిగా నిలిచిపోయి ప్రజాధనం వృధాగా మారింది. మరోవైపు సచివాలయాలను ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాలు, అద్దెభవనాల్లో కొనసాగిస్తుండటంతో ఉద్యోగులు సైతం ఇబ్బందిపడుతున్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం స్పందించి ఆయా సచివాలయ భవనాలు, రైతుభరోసా కేంద్రాలు, విలేజ్‌ హెల్త్‌ క్లీనిక్‌ల భవనాల పనులను పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

పాఠశాల తనిఖీ



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీవైఈవో సాంబశివరావు

గౌరవరం(జగ్గయ్యపేట): ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని నందిగామ డీవైఈవో సాంబశివరావు ఆదేశించారు. జగ్గయ్యపేట మండలంలోని గౌరవరం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో అందుతున్న సౌకర్యాలతోపాటు విద్యార్థుల ఇబ్బందులను అడిగితెలుసుకున్నారు. అనంతరం డీవైఈవో సాంబశివరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలన్నారు. బడిఈడు పిల్లలంతా పాఠశాలకు వచ్చేలా చూడాలన్నారు. కొద్దిరోజుల్లో జరగనున్న పదోతరగతి విద్యాశక్తి కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా కృషి చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. హెచ్‌ఎం గద్దె సూర్యకుమారి, ఉపాధ్యాయులు కృష్ణారావు, రాజేష్‌, పద్మజ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పంటలను కాపాడాలని రైతుల ఆందోళన



పరిటాల రాతి క్వారీల వద్ద ఆందోళన చేస్తున్న రైతులు, మహిళలు

కంచికచర్ల : రాతిక్వారీ, క్రషర్ల కారణంగా రెండు పంటలు పండే సాగు భూములన్నీ బీడు భూములుగా మారుతున్నాయని పరిటాల గ్రామానికి చెందిన రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తమ భూములను కాలుష్య కోరల్లో నుంచి కాపాడాలంటూ రెండోరోజూ బుధవారం కూడా వారు క్వారీల వద్ద ఆందోళన చేశారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ క్వారీల నిర్వాహకులు తమ వ్యాపారం కోసం నాగార్జున సాగర్‌ కాల్వను సైతం కబ్జా చేసి పూడ్చివేశారన్నారు. దీంతో తమ భూములకు సాగర్‌ జలాలు రావడం లేదన్నారు. తమ భూములకు సమీపంలో ఉన్న కాచేటి వాగును కూడా క్రషర్ల యజమానులు ఆక్రమించుకున్నారన్నారు. క్వారీల్లో బ్లాస్టింగ్‌ చేసే సమయంలో తమ భూముల్లో పెద్దపెద్ద రాళ్లు వచ్చి పడుతుండటంతో రైతులు, కూలీలు గాయపడుతున్నారన్నారు. క్వారీ క్రషర్ల నుంచి పెద్దఎత్తున దుమ్ము ధూళి వచ్చి పంట పొలాలపై పడుతుండటంతో పొలాలన్నీ ఎండిపోతున్నాయన్నారు. తమ భూములను అమ్ముకుందామంటే క్వారీ యజమానులు, క్రషర్ల నిర్వాహకులు అడ్డుతగులుతున్నారని, తక్కువ ధరకు వారికే అమ్మాలంటూ బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

లైన్‌మెన్‌ బడేమియా సేవలు ఆదర్శప్రాయం



బడేమియా దంపతులను సత్కరిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

జగ్గయ్యపేటఅర్బన్‌: పట్టణంలోని ఎన్‌ఎస్‌పీ(నాగార్జునసాగర్‌ ప్రాజెక్టు)కాలనీ విద్యుత్‌ లైన్‌మెన్‌ షేక్‌ బడేమియా విధి నిర్వహణలో సేవలు అందరికీ ఆదర్శప్రాయమని వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. లైన్‌మెన్‌ షేక్‌ బడేమియా ఉద్యోగ విరమణ కార్యక్రమం బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌ యార్డులో నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు హాజరై బడేమియా దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో ఆపార్టీ జిల్లా యువజన విభాగం జనరల్‌ సెక్రటరీ పాల్వంచ రమేష్‌బాబు, జిల్లా కార్యవర్గసభ్యులు ఎ.గోపి, బీసీ సెల్‌ నియోజకవర్గ అధ్యక్షుడు జవ్వాజి నరసింహారావు, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్‌ శేషగిరిరావు, పట్టణ యూత్‌ ప్రధాన కార్యదర్శి సురేష్‌, షేక్‌ నూరుద్దీన్‌, రాము, శ్రీను, నిఖిల్‌ పాల్గొన్నారు.

రక్తదాతలు ప్రాణదాతలతో సమానం

రైల్వేస్టేషన్‌(విజయవాడపశ్చిమ): రక్తదానంతో ఎంతో విలువైన ప్రాణాలను రక్షించవచ్చని ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి సంసిద్ధంగా ఉండాలని రైల్వే హాస్పిటల్‌ ఏసీఎంఎస్‌ డాక్టర్‌ ఎం.జైదీప్‌ అన్నారు. రైల్వే హాస్పిటల్‌, రెడ్‌క్రాస్‌ బ్లడ్‌ బ్యాంక్‌ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సత్యనారాయణపురంలోని ఎలక్ట్రిక్‌ ట్రాక్షన్‌ ట్రైనింగ్‌ సెంటర్‌ (ఈటీటీసీ)లో బ్లడ్‌ గ్రూప్‌ శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏసీఎంఎస్‌ డాక్టర్‌ జైదీప్‌ ప్రాణాలను కాపాడటంలో రక్తదానం ఎంతో కీలకమన్నారు. రక్తదానం అనేది సరిహద్దులను దాటి నేరుగా ప్రాణాలను రక్షించే గొప్ప చర్య అని అన్నారు. ప్రతి ఒక్కరూ ముందుగా తమ బ్లడ్‌ గ్రూప్‌ తెలుసుకుని, అత్యవసర పరిస్థితిలో రక్తదానం చేయడానికి సంసిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యాభై మంది ఉద్యోగులు, శిక్షణార్థులు పాల్గొని బ్లడ్‌ గ్రూప్‌ పరీక్షలు చేయించుకుని స్వచ్ఛంద రక్తదానంకు ముందుకు వచ్చారు. అనంతరం సీనియర్‌ డివిజనల్‌ మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ జి.ప్రసన్న లక్ష్మి శిబిరంలో పాల్గొన్న ఉద్యోగులకు బ్లడ్‌ గ్రూప్‌ సర్టిఫికెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఈటీటీసీ ప్రిన్సిపాల్‌ ఎ.సీతారామ్‌, ఉద్యోగులు, ఈటీటీసీ శిక్షణార్థులు పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వైరా-కట్టలేరు

నందిగామరూరల్‌: మండలంలోని దాములూరు కూడలి వద్ద వైరా-కట్టలేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతోపాటు ఎగువ నుంచి వస్తున్న వరదతో వైరా-కట్టలేరు కల్వర్టుపై నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో అప్రమత్తమైన అధికారులు రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలను నిలుపుదల చేశారు. ఏటా వర్షాకాలంలో ఇదే పరిస్థితి నెలకొంటుందని, వరద వస్తే రెండు,మూడురోజులు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇప్పటికైనా పాలకులు స్పందించి బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



దాములూరు కూడలి వద్ద కల్వర్ట్‌పై నుంచి ప్రవహిస్తున్న వైరా-కట్టలేరు

బెల్టుషాపులపై చర్యలు

నందిగామరూరల్‌: గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నందిగామ ఎక్సైజ్‌ సీఐ బంగార్రాజు బుధవారం హెచ్చరించారు. ఎక్సైజ్‌ శాఖ ద్వారా లైసెన్స్‌ పొందిన రిటైల్‌ మద్యం దుకాణాల్లో మాత్రమే ప్రజలు మద్యం కొనుగోలు చేయాలని సూచించారు. లైసెన్స్‌ లేని వ్యక్తులు తక్కువ ధరకే మద్యాన్ని సరఫరా చేస్తామనే పేరుతో కల్తీ మద్యాన్ని విక్రయిస్తారన్నారు. గ్రామాల్లో బెల్టుషాపుల సమాచారాన్ని తెలియజేయాలని ప్రజలను కోరారు.

స్మార్ట్‌మీటర్ల పేరుతో దోపిడీకి తెర

జగ్గయ్యపేటఅర్బన్‌: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్మార్ట్‌ మీటర్ల పేరుతో దోపిడీకి తెర తీసిందని వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర చేనేత విభాగం అధికార ప్రతినిధి పెంటి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రంలో విద్యుత్‌ రంగాన్ని బడా కార్పొరేట్‌ కంపెనీలకు కట్టబెట్టేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. స్మార్ట్‌ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ అందులో తొలిమెట్టు అని పేర్కొన్నారు. స్మార్ట్‌ మీటర్ల ఏర్పాటును అడ్డుకోవాలని ప్రజలను కోరారు.

రోడ్డును అభివృద్ధి చేస్తాం : ఏఈ

వత్సవాయి: పెద్దమోదుగపల్లి–రామచంద్రాపురం రోడ్డు అధ్వానంగా ఉండటంపై 'సాక్షి' దినపత్రిక 'జారిపడతారు జాగ్రత్త' శీర్షిన బుధవారం ప్రచురించిన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. ఈసందర్భంగా పంచాయతీరాజ్‌ ఏఈ సుందరరామయ్య మాట్లాడుతూ ఈ రోడ్డు అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నాబార్డు నిధులు రూ.90లక్షలు మంజూరయ్యాయని, త్వరలోనే టెండర్లు పిలిచి త్వరితగతిన రోడ్డు నిర్మాణం చేపడతామని వివరించారు.

వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు

నందిగామరూరల్‌:మండలంలోని అనాసాగరం శివారులోని కాదంబరి శ్యామక ఆశ్రమంలో ఆషాడ మాస ఉత్సవాలను కనులపండువగా నిర్వహిస్తున్నారు. ఈ మహోత్సవాలలో భాగంగా బుధవారం మాతాజీ శ్రీదేవి ఆధ్వర్యంలో ఆశ్రమంలోని వారాహి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం కుంకుమార్చనలు, మూలమంత్ర హోమాది క్రతువులు, 108 కుష్మాండ హారతులు తదితర కార్యక్రమాలను వేదోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు సమావేశం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): జగ్గయ్యపేట మున్సిపల్‌ కార్యాలయంలో గురువారం ఉదయం పదిగంటలకు స్వర్ణాంధ్ర విజన్‌ డాక్యుమెంట్‌–2047పై నియోజకవర్గ స్థాయి సమీక్షా సమా వేశం జరుగుతుందని ఎంపీడీవో నితిన్‌ తెలిపారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి మహేశ్వరరావు ఆధ్వర్యంలో విజన్‌ డాక్యుమెంట్‌కు సంబంధించి ఆచరణ, ప్రణాళిక తయారీపై సమావేశం జరుగుతుందని వివరించారు. ఈ సమావేశానికి జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి, నందిగామ మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు హాజరుకావాలని కోరారు.

కరపత్రాలు ఆవిష్కరణ

నందిగామటౌన్‌: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై అన్నివర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. ఏడాది కూటమి పాలనపై నిర్వహిస్తున్న సుపరిపాలన–ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముందుగా కూటమి ప్రభుత్వ పాలనపై ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని వివరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

రైల్వేల్లో ప్రైవేటీకరణ నిలిపివేయాలి

గాంధీనగర్‌(విజయవాడసెంట్రల్‌): రైల్వేల్లో ప్రైవేటీకరణ, రైల్వే ఆస్తుల విక్రయం తక్షణమే నిలుపుదల చేయాలని అఖిల భారత లోకో రన్నింగ్‌ స్టాఫ్‌ అసోసియేషన్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ రామకృష్ణ డిమాండ్‌ చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో అఖిల భారత లోకో రన్నింగ్‌ స్టాఫ్‌ అసోసియేషన్‌, డివిజనల్‌ కమిటీ, విజయవాడ బ్రాంచ్‌(ఎస్సీ డివిజన్‌) కమిటీ సంయుక్తంగా 'రన్నింగ్‌ స్టాఫ్‌ హక్కుల ప్రకటన సదస్సు' నిర్వహించింది. సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నూతన పెన్షన్‌ పథకాన్ని రద్దు చేసి, పాత పెన్షన్‌ పథకం అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. లోకో రన్నింగ్‌ స్టాఫ్‌ ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలన్నారు. రన్నింగ్‌ స్టాఫ్‌ భద్రతా నిబంధనలు పాటించేలా అనుమతించాలని, ప్రయాణికుల భద్రతను కాపాడాలన్నారు. రోజుకు పని గంటలు 10 గంటలకే పరిమితం చేయాలని, వరుసగా రెండు రాత్రులకు మించి నైట్‌ డ్యూటీ చేయించకూడదన్నారు. వారానికోసారి 46 గంటల విశ్రాంతి ఇవ్వాలని, రన్నింగ్‌ స్టాఫ్‌ 36 గంటలలోగా హెడ్‌ క్వార్టర్‌కు తీసుకురావాలని కోరారు. రన్నింగ్‌ స్టాఫ్‌ సమస్యలపై పోరాటం విస్తృతం చేయాలన్నారు. సదస్సులో డివిజన్‌ సెక్రటరీ ఆర్వీ రాము, లోకో పైలెట్స్‌ తదితరులు పాల్గొన్నారు.